## 88. స్వర్గం-నరకం

అడవిలో వేటాడే ఓ యోధుడుకి ఓ ఆశ్రమం కనిపించడంతో లోపలకి వెళ్ళాడు. అక్కడ లేడి చర్మం మీద కూర్చుని ధ్యానం చేసుకుంటున్న ఓ యోగిని చూసి అడిగాడు.

"స్వామీ! స్వర్గం, నరకం అనేవి నిజంగా వున్నాయా? లేక అవి రెండూ కట్టు కథలా?"

"నువ్వు అది కూడా తెలీని పిచ్చి వెధవవి అన్నమాట. నువ్వు కవచం ధరించిన పిట్టల దొరవే తప్ప యోధుడివి అయి వుండవు." ఎగతాళిగా నవ్వుతూ చెప్పాడు ఆ యోగి.

వెంటనే అతని మొహం కోపంతో ఎర్రబడి, వుచ్ఛ్వాశ నిశ్వాసలు పెరిగాయి.

"నువ్విప్పుడు నరకంలో వున్నావు." ప్రసన్నంగా చూస్తూ చెప్పాడు యోగి.

తన కోపానికి సిగ్గుపడుతూ అతను తల దించుకుని చెప్పాడు.

"క్షణికావేశానికి లోనయినందుకు నన్ను క్షమించండి."

"నువ్విప్పుడు స్వర్గం మెట్ల మీద వున్నావు." యోగి నవ్వుతూ చెప్పాడు మళ్ళీ.

## 89. నిందలు లేని ఊరు

గబగబా తన గురువు దగ్గరకి వచ్చి చెప్పాడు ఆనందుడు.

"స్వామీ! మీరు ఓ స్త్రీని, ఆమె కొడుకుని హత్య చేసారని కొందరు నీచులు వదంతులు లేవదీసారు."

"అలాగా?" చెప్పాడు బుద్ధుడు.

"వెంటనే మనం ఈ వూరు వదిలి ఇంకో వూరు వెళ్ళిపోదాం స్వామీ."

"కాని ఆ వూరిలో కూడా మనల్ని నిందించే నీచులు వుంటారు కదా? ఏం చేద్దాం?" ప్రశ్నించాడు బుద్ధుడు.

"అదే జరిగితే దాన్ని కూడా వదిలి ఇంకో వూరు వెళ్ళిపోదాం స్వామీ."

"ఆనందా! ఐతే మనం వుండేందుకు ఈ ప్రపంచంలో సరైన వూరే దొరకదు. ఓర్పుతో వాటన్నిటిని సహిద్దాం. నిందలెప్పుడూ శాశ్వతం కావు. అవి కాలంలో కరిగిపోతాయి." హితవు చెప్పాడు బుద్ధుడు.

## 90. ముక్తికి చిట్కా

ఒక సత్రంలో ఇద్దరు యాత్రికులు బస చేసారు. వారిలో ఒకడి దగ్గర డబ్బు మూట వుంది. మరొకడు బీదవాడు. ధనవంతుడి దగ్గర డబ్బున్న సంగతి బీదవాడు గమనించాడు. దాన్ని దొంగిలించి రాత్రికి రాత్రే ఉడాయించాలని బీదవాడు అనుకున్నాడు. ఆ రాత్రి ధనవంతుడు నిద్ర పోయేదాకా దొంగ నిద్రని నటిస్తూ బీదవాడు నిద్ర పోలేదు. ధనవంతుడు గాఢ నిద్ర పోయాక బీదవాడు అతని సంచీని వెదికాడు. ధనం మూట కనిపించలేదు. తర్వాత ధనవంతుడి దిండు కింద, పక్క కిందా వెదికినా ప్రయోజనం లేకపోయింది. ఎంత వెదికినా బీదవాడికి ధనవంతుడి ధనం మూట కనిపించలేదు.

మర్నాడు ధనవంతుడు సత్రం ఖాళీ చేసి వెళుతూ బీదవాడి దిండు కింద దాచిన తన ధనం మూటని తీసుకుని తన దారిన తను వెళ్ళిపోయాడు.

ఇదే విధంగా మనం ముక్తి కోసం ఎక్కడెక్కడో వెదుకుతాం, ఎందరెందరినో ఆశ్రయిస్తాం, ఎన్నెన్ని సాధనలనో చేస్తాం. కాని అది లభించక కొట్టుకు పోతాం. అహం అనే మన దిండు కిందే మోక్షం ఉన్నదని ఎప్పటికో కాని గుర్తించలేం. మనలోని అహం నాశనం అయిన తక్షణం ముక్తి కాంత మనల్ని వరించి తీరుతుంది.